# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన–2 1, నవంబరు, 2014

తెలంగాణలోని హైవేలు, ప్రధాన రహదారులే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు కూడా బాగుపడాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆకాంక్షించారు. ఇందుకోసం వెంటనే తెలంగాణ రూరల్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పిఆర్ పరిదిలోని రొడ్ల అభివృద్ధి, మరమ్మత్తులు, నిర్మాణం కోసం రూ. 5,000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతిరాజ్ పరిధిలో ఉన్న 20 వేల కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేయడానికి రూ. 200 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. వచ్చే రెండేళ్లలో బి.టి.రోడ్ల మరమ్మత్తుకు రూ. 2400 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. రూ. 700 కోట్ల పాత బకాయిలు చెల్లిస్తామన్నారు. 4,146 కిలోమీటర్ల డబ్ల్యుబిఎమ్ రోడ్లను మరమ్మత్తు చేయడానికి రూ. 1450 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. కల్వర్టులు, బ్రిడ్జిలను మెరుగు పరచడానికి మరో రూ. 250 కోట్లను వెచ్చిస్తామన్నారు.

పంచాయతిరాజ్ రోడ్ల పరిస్థితిపై ముఖ్యమంత్రి శనివారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. డిప్యూటి సిఎం డా.టి.రాజయ్య, మంత్రులు కేటి.రామారావు, టి. హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, అధికారులు రేమాండ్ పీటర్,ప్రదీప్ చంద్ర, ఎస్.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలోని అన్ని రకాల రోడ్లను మెరుగుపరచాలని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి గురు, శుక్రవారాల్లో ఆర్ అండ్ బి పరిధిలోని రోడ్లపై సమీక్ష నిర్వహించారు. శనివారం పిఆర్ పరిధిలోని రోడ్లపై సమీక్ష నిర్వహించారు. పిఆర్ రోడ్లకు సంబంధించిన పనులు కూడా త్వరితగతిన జరగాలని, వారం రోజుల వ్యవధిలోనే టెండర్లు పిలవాలని, 15వ రోజు వర్క్ ఆర్డర్ ఇవ్వాలని, 20 రోజు పని ప్రారంభం కావాలని, నవంబర్ నెలాఖరు వరకు అన్ని పనులు ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని వెల్లడించారు. రోడ్ల పనుల కోసం అవసరమైన నిధులను విడుదల చేస్తామని, పెండింగ్ బిల్లులు కూడా

చెల్లిస్తామని వెల్లడించారు. ప్రతి ఏటా రోడ్ల మరమ్మత్తు కోసం ఇవ్వాల్సిన డబ్బులుకూడా ఇస్తామని, మరమ్మత్తులు వెంట వెంటనే చేయాలని ఆదేశించారు.రాష్ట్రంలో 29 వేల కిలోమీటర్లకు పైగా మట్టి రోడ్లు ఉన్నాయని, అందులో ఎన్ని రోడ్లు ఉపయుక్తంగా ఉన్నాయో గుర్తించాలని చెప్పారు. రాష్ట్రంలో ఇంకా 1614 ఆవాస ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం లేదని, వాటికి వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు సౌకర్యం లేని ఊరు గాని, ఆవాస ప్రాంతం కాని ఉండవద్దని చెప్పారు. శాంతిభద్రతల తరువాత రహదారులకే అత్యంత ప్రాముఖ్యత ఉన్నదని సిఎం అన్నారు. రాష్ట్రంలోని అన్ని రహదారులను మెరుగుపరచాలని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి దీనికి సంబంధించి కార్యాచరణను రూపొందించడానికి త్వరలోనే అన్నిస్థాయిల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం కావాలని నిర్ణయించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం